ఆలిండియా బాడ్మింటన్ పోటీల్లో ఏసీపీకి కాంస్యం

జితేందర్‌రెడ్డిని అభినందిస్తున్న సీపీ

సుబేదారి, మార్చి 23 : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బాడ్మింటన్ పోటీల్లో కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగం ఏసీపీ జితేందర్‌రెడ్డి కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు అతడిని శనివారం సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. కాగా, వరంగల్ జిల్లాలోని రాయపర్తి కిష్టాపురం చెక్‌పోస్టును సీపీ తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్ డెలివరీ చేయని మిల్లర్లు

- రూ. 12.38 కోట్ల సీఎంఆర్ బకాయి
- వరంగల్ జిల్లాలో నాలుగు రైస్ మిల్లులపై చర్యలకు నిర్ణయం
- ఇప్పటికే ఓ మిల్లు యజమానిపై కేసు

వరంగల్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ చేయని డిఫాల్టర్లపై ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాలో నాలుగు రైస్ మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే ఒక రైస్ మిల్లు యజమానిపై అధికారులు కేసు నమోదు చేశారు. 2022-23 వానకాలం సీజన్‌లో ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల నుంచి 1,79,922 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. దీన్ని సీఎంఆర్ డెలివరీ కోసం జిల్లాలోని రైస్ మిల్లర్లకు తరలించింది. రైస్ మిల్లర్లు ప్రభుత్వం తమకు కేటాయించిన ధాన్యాన్ని నూర్పిడి చేసి సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐ, సీఎస్‌సీకి డెలివరీ చేయాల్సి ఉంది. 1,21,017 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి డెలివరీ చేయాల్సి ఉండగా, రైస్ మిల్లర్లు 1,18,446 టన్నుల బియ్యాన్ని మాత్రమే డెలివరీ చేశారు. అంటే 98 శాతం సీఎంఆర్ డెలివరీ జరిగినట్లు పౌర సరఫరాల సంస్థ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని నాలుగు రైస్ మిల్లుల యజమానులు పూర్తిగా 2022-23 వానకాలం తాము ప్రభుత్వం నుంచి పొందిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్‌ను డెలివరీ చేయలేదు. ఈ నాలుగింటిలో సంగెం మండలం పల్లారిగూడలోని శ్రీమహాలక్ష్మి బిన్ని రైస్‌మిల్, నర్సంపేటలోని శ్రీ వీరభద్ర మోడ్రన్ రైస్‌మిల్, గీసుగొండ మండలం గొర్రెకుంటలోని జయ ఇండస్ట్రీస్, చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ వద్ద ఉన్న లక్ష్మీగణపతి రైస్ మిల్లులు ఉన్నట్లు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ సంధ్యారాణి వెల్లడించారు. ఈ నాలుగు రైస్ మిల్లుల యజమానులు రూ.12.38 కోట్ల విలువ చేసే 2,547 టన్నుల సీఎంఆర్ బకాయిలు ఉన్నట్లు ఆమె తెలిపారు. మహాలక్ష్మి బిన్ని రైస్‌మిల్ రూ.2.35 కోట్లు, శ్రీ వీరభద్ర రైస్ మిల్ (పాత ముగ్దుంపురం) రూ.3.50 కోట్లు, జయ ఇండస్ట్రీస్ రైస్ మిల్ రూ.2.13 కోట్లు, లక్ష్మీగణపతి రైస్‌మిల్ రూ.4.40 కోట్ల విలువ చేసే సీఎంఆర్‌ను డెలివరీ చేయాల్సి ఉందని ప్రకటించారు. వీటిలో మహాలక్ష్మి బిన్ని రైస్‌మిల్ 722, శ్రీవీర భద్ర రైస్‌మిల్ 1,073, జయ ఇండస్ట్రీస్ 654, లక్ష్మీ గణపతి రైస్‌మిల్ 1,351 టన్నుల ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ బకాయి ఉన్నట్లు సంధ్యారాణి వెల్లడించారు. ఈ నాలుగు మిల్లులకు 2022-23 వానకాలం మొత్తం 5,094 టన్నులు, యాసంగిలో 1,272 టన్నుల ధాన్యాన్ని కేటాయించినట్లు ఆమె తెలిపారు. సీఎంఆర్ డెలివరీ చేయని ఈ రైస్‌మిల్లుల డిఫాల్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా మేనేజర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు శ్రీమహాలక్ష్మి బిన్ని రైస్ మిల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. త్వరలో వీరభద్ర మోడ్రన్ రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జయ ఇండస్ట్రీస్, లక్ష్మీగణపతి రైస్‌మిల్లులపై కేసు నమోదు చేసే ప్రక్రియ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

ల్యాండ్రో మార్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మార్చి 23 : నిర్ణీత గడువులోగా గ్రేటర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. శనివారం పోతన నగర్‌లోని ల్యాండ్రో మార్ట్, ఆరెపల్లి సమీపంలో నిర్మిస్తున్న గ్రాండ్ ఎంట్రెన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ల్యాండ్రో మార్ట్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్‌సిటీ ప్రతినిధులకు సూచించారు. దీని నిర్వహణ బాధ్యతలను బీసీ వెల్ఫేర్‌కు అప్పగిస్తామన్నారు. భద్రకాళీ బండ్ పనులను పరిశీలించిన ఆమె పలు సూచనలు చేశారు. వరదల సమయంలో తెగిన కట్టను పరిశీలించి వాల్వ్ నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ సంజయ్‌కుమార్, స్మార్ట్‌సిటీ ప్రతినిధి ఆనంద్ పోలేటి, డీఈలు రవికుమార్, రవికిరణ్, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టంతో గెలిచా : ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ/దామెర, మార్చి 23 : పరకాల ప్రజలందరి సహకారం, పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టంతోనే ఎమ్మెల్యేగా గెలిచానని రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో శనివారం మండలంతో పాటు గ్రేటర్ 17వ డివిజన్ కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. నాయకులు మాధవరెడ్డి, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు. కాగా, టీఎఫ్‌సీసీ రాష్ట్ర ఫిషర్‌మన్ కార్యదర్శి సొప్పరి రాజేశ్‌తోపాటు మత్స్య కార్మికులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, పోలెపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగిలిచెర్లలో ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మల్లేశ్వర్

గీసుగొండ, మార్చి 23 : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో వరంగల్ లలితశ్రీ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బొట్టు మల్లేశ్వర్ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తన తండ్రి కుమారస్వామి జ్ఞాపకార్థం ప్రతి ఏటా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

టీబీ రహిత జిల్లాగా మార్చాలి: డీఎంహెచ్‌వో

గిర్మాజీపేట, మార్చి 23: వచ్చే ఏడాది వరకు వరంగల్‌ను టీబీ రహిత జిల్లాగా మార్చడంలో వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. ప్రపంచ టీబీ రహిత దినోత్సవం సందర్భంగా శనివారం డీఎంహెచ్‌వో తన కార్యాలయంలో వైద్య సిబ్బందికి టీబీవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్! వీ కెన్ ఎండ్ టీబీ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలోనే జిల్లాను టీబీ రహితంగా ప్రథమ స్థానంలో నిలుపాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సుధాకర్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ శ్రావణికి సన్మానం

శ్రావణిని సన్మానిస్తున్న సీఐ మల్లయ్య

ఖిలావరంగల్, మార్చి 23: కొమ్మాల గ్రామం దస్రుతండాకు చెందిన ఆటో డ్రైవర్ హులావత్ శ్రావణిని మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య శనివారం ఘనంగా సన్మానించారు. తండ్రి దూరంగా ఉన్నా ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నది. అంతేకాకుండా తన ముగ్గురు చెల్లెళ్లను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఆమె సత్కరించినట్లు సీఐ వెల్లడించారు.

'ప్రజాస్వామ్యం బతకాలంటే బీజేపీని ఓడించాలి'

హనుమకొండ, మార్చి 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐలను తన జేబు సంస్థలుగా వాడుకుంటున్నారని విమర్శించారు. లిక్కర్ స్కాంతో సంబంధం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇదే లిక్కర్ స్కాంతో సంబంధమున్న అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డిని ఈడీ అరెస్టు చేసిందని, ఆయన నుంచి రూ.40 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ తీసుకున్నట్లు ఎన్ఫోఐ వెల్లడించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోత్ వీరన్న, రాగుల రమేశ్ పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ పద్మ

కరీమాబాద్, మార్చి 23 : కోయ కులస్తుల దైవమైన గోపయ్య-లక్ష్మీ తిరుపతమ్మ స్వామి కల్యాణం శనివారం కరీమాబాద్‌లోని కోయవాడలో కనులపండువగా జరిగింది. వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఏటా స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్పొరేటర్ పల్లం పద్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకారపువారి గుడిలో..

గిర్మాజీపేట : స్టేషన్‌రోడ్డులోని ఆకారపువారి గుడిలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని ప్రధాన అర్చకుడు లంకా శివకుమార్‌శర్మ వైభవంగా నిర్వహించారు. ఈవో ఎన్ వెంకట్రావు సౌకర్యాలు కల్పించారు.

కొలువుదీరిన చెన్నకేశవ స్వామి

ఆలయంలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి

దామెర, మార్చి 23 : కోగిల్వాయిలోని చంద్రగిరి గుట్టపై ఉన్న ఆలయంలో చెన్నకేశవస్వామి కొలువుదీరాడు. అంతకుముందు గ్రామంలోని ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు దివి వెంకటజోగాచార్యులు శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం జాతర కమిటీ చైర్మన్ గుండా సురేశ్ ఆధ్వర్యంలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పాలకుర్తి అశోక్, చుక్క సాంబయ్య, బండి అనిల్, కార్తీక్, రమేశ్, అర్చకుడు కేశవాచార్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకన్న(ఫైల్)

పర్వతగిరి, మార్చి 23: కల్లెడ శివారు ముంజాల కుంటతండాకు చెందిన రమావత్ వెంకన్న(35) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. వెంకన్న కొత్త ఇంటి అవసరం కోసం విద్యుత్ మోటారు బిగించి వాటర్ లెవెల్ ఎక్కిస్తుండగా షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్..

శ్రీధర్(ఫైల్)

కమలాపూర్, మార్చి 23 : మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ పత్తిపాక శ్రీధర్ (40) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. హనుమకొండలో వివాహ వేడుక ఫొటోలు తీసి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా బావుపేట క్రాస్ రోడ్డు కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతకి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఖానాపురం, మార్చి 23: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అశోక్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాదరబోయిన వెంకన్న(35) వృత్తిరీత్యా పశువుల కాపరి. మద్యానికి బానిస కావడంతో ఆరేళ్ల క్రితం పిల్లలను పదిలేసి భార్య వెళ్లిపోయింది. తల్లిదండ్రుల వద్ద ఉంటూ నిత్యం మద్యం తాగి వారిని వేధిస్తున్నాడు. దీంతో వారు హైదరాబాద్‌లో తన కూతురు ఇంటికి వెళ్లి కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్న వెంకన్న మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు ప్రారంభిస్తామని ఎస్సై రఘునాథ్ తెలిపారు.

గడ్డిమందు తాగి వృద్ధుడు..

వెంకటయ్య(ఫైల్)

శాయంపేట, మార్చి 23 : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పుల గ్రామానికి చెందిన కుసుమ వెంకటయ్య(65) కూలి పని చేసుకుంటూ బతుకుతున్నాడు. కొంతకాలంగా వెన్ను నొప్పి, పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. బాధను భరించలేక జీవితంపై విరక్తి చెందిన వెంకటయ్య ఈ నెల 22న గడ్డి మందు తాగాడు. వెంటనే వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వర్ధన్నపేట, మార్చి 23 : ఆకేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఉదయం ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ల్యాబర్తి సమీపంలోని ఆకేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

వర్ధన్నపేట, మార్చి 23: మున్సిపాలిటీ పరిధిలోని డీసీతండాలో పిచ్చికుక్కలు శనివారం స్వైర విహారం చేశాయి. సాయంత్రం సమయంలో పిచ్చికుక్కలు ఒక్కసారిగా తండాలోని ఎనిమిది మందిపై దాడి చేశాయి. వృద్ధుడితోపాటు పిల్లలు, మహిళలను కరిచాయి. గాయపడిన వారిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఫార్మాసిస్ట్ సస్పెన్షన్

వరంగల్ చౌరస్తా, మార్చి 23: ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మందులను పక్కదారి పట్టించిన ఓపీ విభాగం ఫార్మాసిస్ట్ తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ గిరిధర్ తెలిపారు. గురువారం రూ.81 వేల విలువైన మందులను బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్న క్రమంలో అధికారులు కాశీబుగ్గలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే.

రేషన్ డీలర్లపై ఫిర్యాదు

శాయంపేట, మార్చి 23 : రేషన్ షాపుల్లో అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేశ్ శనివారం తహసీల్దార్ సుభాషిణికి ఫిర్యాదు చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి మూడు కిలోల వరకు బియ్యం తక్కువ ఇస్తూ పేదల పొట్ట కొడుతున్నారని అందులో పేర్కొన్నారు. జిల్లా నాయకులు రాజశేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ : నరేంద్రనగర్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాజీపేట : సోమిడిలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

గిర్మాజీపేట/కాశీబుగ్గ/పర్వతగిరి, మార్చి 23 : పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు సరిగా ఉండాలని వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వరంగల్ కాశీబుగ్గలోని ప్రభుత్వ నరేంద్రనగర్ హైస్కూల్‌తోపాటు ఎల్బీనగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్లను ఆమె శనివారం తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని ఇన్విజిలేటర్లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ప్రతిష్టంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాస్ ఉన్నారు. కాగా, పదో తరగతి మ్యాథ్స్ పరీక్షకు వరంగల్ జిల్లావ్యాప్తంగా 99.86 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో వాసంతి తెలిపారు. 9,455 రెగ్యులర్ విద్యార్థులకు 9,442 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారు. 22 మంది ప్రైవేట్ విద్యార్థులకు 19 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను వివిధ తనిఖీ బృందాలు సందర్శించగా, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. పర్వతగిరి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈవో వాసంతి తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ పాక రమేశ్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ చౌరస్తా/కాజీపేట : హనుమకొండ జిల్లాలో పదో తరగతి గణితం పరీక్షకు 12,018 మంది విద్యార్థులు, ప్రైవేట్ విద్యార్థులు 117 మంది హాజరైనట్లు డీఈవో అబ్దుల్ హై తెలిపారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ రెండు పరీక్షా కేంద్రాలు, అదనపు కలెక్టర్ రెండు పరీక్షా కేంద్రాలు, డీఈవో 11 పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 24 పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. కాగా, సోమిడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దర్గా కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లోని సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ భావ్‌సింగ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ నలుగురు మృతి

ఖానాపురం/ఐనవోలు/పర్వతగిరి/హసన్‌పర్తి, మార్చి 23 : వేర్వేరు కారణాలతో దవాఖానల్లో చికిత్స పొందుతూ శనివారం నలుగురు మృతిచెందారు. ఖానాపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి నాగయ్య(25) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. నాగయ్య సోదరుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు. అలాగే, ఐనవోలు మండలంలోని పున్నేల్ గ్రామానికి చెందిన పల్ల కొండ శ్రీలత(40) ట్యాబ్లెట్లను మోతాదుకు మించి వేసుకోవడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తండ్రి రాయపురం మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన అక్కల మల్లయ్య(55) ఐదు రోజుల క్రితం వ్యవసాయ భూమి వద్ద పాముకాటుకు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతడి భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. హసన్‌పర్తి మండలం బావుపేట క్రాస్‌రోడ్డులో బైక్‌పై వెళ్తున్న పత్తిపాక శ్రీధర్(40)ను శుక్రవారం కారు ఢీకొట్టగా, హనుమకొండలోని దవాఖానకు తరలించారు. అతడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

ఎన్నికల ప్రచార వ్యయంపై సమీక్ష

హనుమకొండ, మార్చి 23 : పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన రేట్ చార్ట్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సమావేశం నిర్వహించారు. సభలు, వేదిక, ప్రచారానికి వినియోగించే స్క్రీకర్లు, చైర్లు, టెంట్ సామగ్రి, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్స్, కటౌట్స్, ఫ్లెక్సీలు, వీడియో కవరేజ్, వాహనాలు, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సామగ్రి ధరల పట్టికను అడిషనల్ కలెక్టర్ పార్టీల ప్రతినిధులకు అందజేసి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద రావు, పార్టీల ప్రతినిధులు నేహాల్, రజినీకాంత్, మణి, శ్యామ్, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల వివరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

అభివృద్ధి పనుల పరిశీలన

ఆత్మకూరు, మార్చి 23 : మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోని డ్రైనేజీలు, ఇంకుడు గుంతలను శనివారం ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. ఏపీవో రాజిరెడ్డిని ఇంకుడు గుంతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం మండల సమాఖ్య, ఉపాధి కార్యాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజ, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈసీ రాము, టీఏ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఐనవోలు, మార్చి 23: ట్రీ కటింగ్ చేస్తున్నందున ఐనవోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సింగారం, వనమాలకనపర్తి, కొండపర్తి, నందనం, జగ్గయ్యగూడెంలో బావులకు సరఫరా ఉండదని ఐనవోలు, పంథిని విద్యుత్ ఏఈలు శివకుమార్, రమేశ్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

వరంగల్, మార్చి 23 : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్వీప్-2024లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, టీపీఆర్‌వో కోలా రాజేశ్‌కుమార్, అధ్యాపకులు మాలతి, కృష్ణవేణి, అనురాధ, విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రజల జీవితాలతో 'సహారా' ఆటలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 23 : సహారా సంస్థ పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడిందని, కొత్త స్కీంలు పెట్టి స్కాంలు చేసిందని సహారా బాధితుల అఖిల పక్ష సంఘం సభ్యురాలు పూజిత ఆరోపించారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సహారా బాధితులు మాట్లాడారు. ప్రజల డబ్బును బడా బాబులకు బహుమతులుగా పంచి పెట్టిందన్నారు. 2022 మార్చి 3న సంస్థ లైసెన్స్ రద్దు చేసినా ఇంకా దొంగ వ్యాపారం చేస్తున్నారని, వరంగల్ వ్యాప్తంగా 2 లక్షలకు పైగా బాధితులు ఉన్నారని చెప్పారు. కాశీబుగ్గ, నక్కలగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్, నర్సంపేట, కురవి, ఖమ్మం, భూపాలపల్లి, కాటారం, ధర్మసాగర్, చెల్పూర్, ఆత్మకూరు, మొగుళ్లపల్లి, జమ్మికుంట ఇలా మొత్తం వరంగల్ రీజినల్ ఆఫీస్ పరిధిలో 33 కార్యాలయాలు నడు